బంధితుడు

కె. మాధురి

'ఆ ప్రక్కన కూరగాయ మొక్కలు వెయ్యి ఈ మూల తులసికోట పెట్టుకో. నాల్గు నిత్యమల్లి గింజలు చల్లు పూజకి పనికివస్తాయి పిల్లల్ని జామచెట్టు జోలికి వెళ్ళనివ్వకు. తింటే పైత్యం చేస్తుంది ఇంటాయనతో చెప్పి కొట్టించేస్తాను కట్టెలు వంటింట్లో పెట్టబోకు. పురుగూపుట్రా చేరగలవు దొడ్లో కావలసినంత జాగా వుంది. నా పడకుర్చీ బయట గదిలో కిటికీకి ఓ గజం పక్కగా వెయ్యి రోడ్డుమీద వెధవగోల'

కొత్తగా అద్దెకు పుచ్చుకున్న కొంపను పై హెచ్చరికలతో ఛార్జి అప్పగించాడు ఆనందరావు భార్యకు.

ఆనందరావుకు అతని తల్లీదండ్రీ ఆ పేరు ఏమంటూ పెట్టారోగాని ఎరిగిన వాళ్ళెవరూ అతని ముఖాన ఆనందరేఖలు గానీ, కనీసం చిరునవ్వునుగానీ చూడలేదు అతనెప్పుడూ తన సొమ్ము ఎవరో తినిపోతున్నట్టు చిటముటలాడుతూ వుంటాడు ఎరిగిన వాళ్ళతన్ని వెర్రి ఆనందరావని, చాదస్తపు ఆనందరావనీ, ప్రిన్సిపుల్డ్ ఆనందరావనీ, అంత కటికవాడు పుట్టబోడు పెరగబోడనీ అనుకుంటూవుంటారు అంత నిక్కచ్చి మనిషి అతను

ఆ కుర్చీ ఆ మూలనే వుండాలి పేపరు చదవగానే సరిగ్గా మడతపెట్టి బల్లలో ఆ సొరుగులోనే పెట్టాలి. ఆ టేబుల్‌క్లాత్ అంత కిందికే వేళ్ళాడాలి. విడిచిన జోళ్ళు సరిగ్గా ఆ మూలే పెట్టాలి

కుటుంబ నియంత్రణమీద అతని అభిప్రాయాలు అతనికున్నాయ్. మానవాధముడెవడికీ తన్ని పిల్లల్ని కనొద్దని చెప్పే అధికారం లేదనుకుంటాడు అంతగా అయితే ఈ ముండమోపి ఉద్యోగం ఒదులుకుంటానుగాని వీళ్ళెవరు నన్ను పిల్లల్ని కనొద్దని చెప్పటానికి అంటాడు సర్కారువార్ని వుద్దేశించి.

అతని భార్య గడపదాటి బయటికి రాదు, పొరుగింటికి అప్పులకి వెళ్ళదు. ఇరుగూపొరుగూ ఇతని ఇంటికి రారు ఒకళ్ళతో మనకి అవసరం ఏమిటి? అని రోజుకి పదిసార్లు పెళ్ళాం పిల్లలకి నూరిపోస్తాడు. తనకు నచ్చిన చిత్రానికి శనివారం రెండో ఆటకి భార్యాసమేతుడై వెళ్తాడు వస్తువులకేకాక ఇంట్లో మనుషులకూడా రూల్సు అమలు జరుపుతాడు

పత్యానికైనా ఇంట్లో కాఫీ వాసన తగలరాదు. సంవత్సరానికి మూడు కట్టుడు చీరలు మించి వాడరాదు తొడుక్కొన్న ఇస్త్రీబట్టలు మూడ్రోజులూ మడత నలక్కూడదు పండగైనా పబ్బమైనా రాత్రి తొమ్మిదివరకూ పిల్లలు చదవాల్సిందే. ఒళ్ళు కోసే చలయినా చన్నీళ్ళ స్నానం చెయ్యాల్సిందే రేడియో బద్దలుగొడుతూ తెలుగు పాటలు వొచ్చినా పిల్లలు వినగూడదు

నెల మొత్తం ఖర్చువేసి గీత గీపి యిస్తాడు భార్యకు ఇవ్వాళ తెచ్చిన కూరలు నాల్రోజులు రావాలంటే రావాల్సిందే. శోభనంనాడే తన ప్రిన్సిపుల్స్ అన్నీ భార్యకి వివరించి చెప్పి, ఆనాటి నుంచీ తిరుగులేకుండా ఏలుతున్నాడు. కలం గీతతో ఉరిశిక్ష వేయించగలిగిన న్యాయమూర్తికున్న ఫుల్ పవర్లున్నాయి అతనికి ఇంట్లో ఒకళ్ళకు చెప్పటమే కాదు ఆ ప్రిన్సిపుల్సనే కాళ్ళకూ చేతులకీ సంకెళ్ళు వేసుకుని అవి సాగినంతమేరే అడుగులువేస్తూ ఎత్తుపల్లాలు లేని సమతలంమీద నడుస్తున్నాడు ఆనందరావు జన్మల్లోకెల్ల మానవజన్మ-మానవజన్మలో పురుషజన్మ — వాడ్ని సేవించి తరించడానికి స్త్రీ అనే సూత్రాన్ని అతను నిద్రలో కూడా మర్చిపోడు

ఇల్లా ఆరుగురి పిల్లలతో—అనుకూలవతిగా శాసించబడ్డ అర్ధాంగితో కొత్తగా అద్దెకు పుచ్చుకున్న ఇంట్లో కట్టుదిట్టంగా కాపురం చేస్తున్న ఆనందరావుకి ఒక అపశ్రుతి ఎదురైంది.

అయిదున్నరకు హిందూ నాలుగో పేజీ చూస్తున్నాడు అతను పిల్లలు చాపలు పరచుకోబోతున్నారు

'బృందావనమది అందరిదీ' ఇందాకటి కన్న పెద్దగా వినవొచ్చిందీసారి అది పాటలాగే పైగా కాస్త హాయిగా కూడా వుంది. తన నిశ్శబ్ద ప్రపంచాన్ని ధిక్కరిస్తున్న ధ్వని ఏ వైపునుంచా అని చూశాడు ఆనందరావు

'నేనొక పూలమొక్కకడ నిల్చి' ఆదీర్ఘం పద్యం పాటగా మారి చెవులో 'రింగు'మంటూంది

'సత్తెం' సత్తెం! ఇటు రావే!' ఆగలేక ఒక కేక పెట్టాడు.

సత్తెం తాలింపువేసే సమయమది. అయినా పిలుపు మన్నించక తప్పదు గనక హాజరైంది.

'ఏమిటీ న్యూసెన్స్?' విసుగ్గా అడిగాడు

పేపరు చూస్తూనే న్యూసెన్స్ అంటాడేమిటా అని తెల్లబోయిందామె.

'వినపట్టంలేదా?'

'ఏమిటండీ' వినపట్టంలేదు చెప్పరాదూ?'

'చల్లగా హాయిగా '

'అదా! బాగానే పాడుతున్నాడుగదండీ' అందామె అమాయకంగా

'బాగానా! నీ మొఖం కాదూ! ఎక్కడ్నుంచి వస్తూంది? దీపాలు పెట్టేవే! పిల్లలు తిరిగే కొంపలోకి పాటకో టైము చోటూ వుండక్కర్లా!'



సమస్య పూర్తిగా అర్థమైంది ఆమెకి ఇది ఎదిరించి నిలబడే సమస్యగాదు. ఇంకా రెండు మాట్లాడితే పాటలు వింటున్నాడనే సాకు మీద చంటివాడి వీపు చీరెయ్యగలడు. అందుకే అతన్తోపాటు పాటను ఆలకించింది. ఇద్దరూ తేల్చుకునేసరికి యింకో నాలుగు రాగాలు ఆ పాట పక్క వాటాలోంచి రెండు వాటాల మధ్య జాయింటు గోడమీద వెంటిలేటర్లోంచి

'వీళ్ళకి బుద్ధీజ్ఞానం లేనట్టుందే. వెళ్ళి చెప్పొస్తాను.'

ఒచ్చి అంతా నాల్రోజులు కాలేదు అప్పుడే తగాదాకి సిద్ధమైన లతన్ని చూసి భయపడింది ఆమె. ఇల్లు సదుపాయంగా వుంది కదా అని ఆశపడింది.

'మీరు వూరుకోండి యీసారి, కొత్తగాదా. తెలియకపోవచ్చు. నేనావిడకు చెప్తాను.' ఎట్లాగో సర్ది చెప్పింది.

ఖచ్చితంగా ఉదయం ఎనిమిది

పట్టువస్త్రం కట్టి వెంకటేశ్వరుడి ముందు సాష్టాంగపడ్డాడు ఆనందరావు.

చెవులో శూలంలాగా ఈలపాట మూడో నేత్రం తెరిచి వంటగదిలోకి దూకాడు. 'వాళ్ళని అనే పన్లేదే నువ్విచ్చిన అలుసే. లేకపోతే నీకూ పాటలు విని ఎగరాలనుందా?' జానెడు వంటింట్లో వీరవిహారం చేశాడు ఇతని అరపులకు సగం చచ్చిందామె

'చెప్పానండీ' గట్టిగా చెప్పాను ఇంతకుముందు ఇంట్లో ఎవరూ లేక

పాడుకోవటానికి అలవాడు పడ్డాడట పిల్ల వాడు. మందలిస్తానని మరీ మరీ చెప్పిం దావిడ. మళ్ళా చెపుతాను. ఈ పూటకి ఓపిక పట్టండి.'

'నీవల్ల కాకపోతే నాకు చెప్పు. ఒక సారి చెపితే బుద్ధుండాలి మనుషులకి. సంసార్లున్న కొంపలో ఇరవై నాలు గ్గంటలూ కూనిరాగాలు! పిల్లల్ని కనగానే సరిగాదు. డిసిప్లిన్‌లో పెంచాలి ' గొంతు పెంచి అరిచాడు.

మరోవారం ప్రశాంతంగా వెళ్ళింది. యీలోగా అతను దొడ్లోవాళ్ళ వేపు పెరిగి గోడదాటి వొచ్చిన సన్నజాజి తీగను ఖచ్చి తంగా సగానికి కత్తిరించాడు. తన వాటా లోంచి పారే మురుగుకాల్వని మూయిం చాడు. వాళ్ళు అంటుకీ సొంటుకీ పనికి రాని మనుషులని తేల్చాడు పక్క వాటా వేపు వెళ్తే కాళ్ళు విరక్కొడ్తానని హెచ్చ రించాడు యింటోవాళ్ళని. ఇన్ని కట్టు దిట్టాలు చేసి ఆ ఆదివారం మధ్యాహ్నం ప్రశాంతంగా మద్ద ముప్పయి మూడోసారి నముల్తుండగా 'మానవుడే మహనీయుడూ' సన్నగా మొదలైన రాగంతరంగాలు తరం గాలుగా. ముద్దగొంతులో చిక్కుపడింది. 'నీవల్లకాదే. ఎందుకూ పనికిరావు జనాభా లెక్కకితప్ప'—కంచం అవతలికి నెట్టి బయటికిపోయాడు. ఆ పోవటం పోవటం వడ్రంగినీ నిచ్చెన్నీ వెంటబెట్టుకుని వొచ్చాడు. వెంటిలేటరు సందులేకుండా చెక్క కొట్టించాడు. అంతటితో ఆ పీడా విరగడైందనుకున్నాడు.

ఆ రోజు ప్రశాంతంగా పడక్కుర్చీలో వాలి లెక్కల పేపర్లు దిద్దుతున్నాడు. మార్కులు కొసిరి కొసిరి నవర్సల్లా వొడ్డిస్తున్నాడు. ఎర్రపెన్సిల్ నొక్కిపట్టి గుండు సున్నాలు చుడుతున్నాడు. ఆ రసా నందంలో మునిగి తేల్తుండగా.

'జగమేమాయా— బ్రతుకేమాయా' నిజంగా మాయా అనుకునేంత మందంగా బరువుగా ఆ పాటగదిలోకి రావటమేకాదు. చంటివాడ్ని మధ్యపెడ్తూందని తెలిసి శివ మెత్తిపోయాడు

ఒక్క దూకులో పక్కవాటా ముందు పడ్డాడు.

బిక్కచచ్చిన సత్యవతి తలుపు దగ్గరికి చేరింది.

తలుపు దబాదబా బాదాడు అతను

'ఎవరు నీవు ఎచటనుండి వొచ్చితివి? తలుపులు బాదుచుంటివి?' రాగయుక్తంగా ప్రశ్నించింది లోపలి కంఠం.

'నీకు బుద్ధుందా లేదా? పక్కవాళ్ళు బతకాలా అక్కర్లేదా? బయటికొచ్చి మాట్టాడు చూస్తాను' బుసలుకొట్టాడు.

'నిద్రపోవాలనేగా జోలపాడుతున్నాను యింకేం పాడమంటారు చెప్పండి. అమ్మ లేదు. రేపొద్దున్నే వొచ్చి మాట్టాడండి'

తెరవని తలుపు ఫెడీమని ముఖాన కొట్టి నట్టయింది పెడసరపు సమాధానంతో వొంటో మంటలు పెట్టినట్లయింది. ఏం చెయ్యలేక తిరిగి వొచ్చాడు. ఆ రాత్రి తెల్లవార్లూ నిద్రపోలేదతను. వీలయినన్ని పేపర్లు సున్నాలు చుట్టాడు. వోపికున్నంత వరకు పెళ్లాన్ని సాధించాడు. ఏ తెల్లవారు ఝామునో మాగన్నుగా ఓ కునుకు

ఉదయాన్నే పాలుతాగి బజారుకెళ్ళిన మనిషి పదయినా తిరికిరాలేదు. ఇన్నేళ్ళలో



ఏ వొక్కరోజూ స్కూలుకు లేటుగా వెళ్ళని మనిషి—

ఇదేదో దుష్ట సంకేతంలా కన్పించిందామెకు దిగాలుపడి అట్లానే కూచుంది ఆ మధ్యాహ్నానికి వొచ్చాడు ఆనందరావు బళ్ళు బయట ఆపించి.

'సామాన్లు సర్దెయ్యి. యిల్లు ఖాళీచేద్దాం'

తెల్లబోయింది ఆమె.

'తొందరగా కానివ్వు. ఈ ఛండాల పొరుక్కున్న వూరవతల వొంటి నిట్టాడి పాకలో వుండటం నయం కానివ్వు నాలుగింటికల్లా కొత్తింట్లో వుండాలి, మళ్లా వొర్జం వొస్తుంది' ఫైనల్ డిక్లరేషన్ యిచ్చాడు.

సత్తెం నిమిత్తమాత్రురాల్లా నిలబడింది.

'అన్నయ్యగారూ' తెల్లటి చీరలో ఆవిడ 'ఎవరమ్మా నువ్వు' మడుస్తున్న కుర్చీ గోడకానించి అడిగాడు.

'మనపక్కావిడ' పరిచయం చేసింది సత్యవతి

'బయట బళ్ళు' ఆవిడ అనబోతుంది. ఆమె మాట మధ్యలో అందుకున్నాడు ఆనందరావు వెతకబోయే తీగ అడ్డం పడ్డట్టు 'ఖాళీ చేసి పోతున్నాంతల్లీ, పోతున్నాం. మీరిక హాయిగా వుండండి ఇరవైనాలుగ్గంటలూ పాడుకోండి. మనిషికో మాటన్నారు ఎంత చెప్పినా వినకపోతిరి. పొరుగున ఒకడున్నాడు. పెళ్ళాం బిడ్డలతో కాపురం చేస్తున్నాడు అనే జ్ఞానం లేకపోయె యివ్వాళతో మా పీడ విరగడవుతుంది. గొంతులు పగిలేట్టు పాడుకోండి. ఏ పొరుగూ పక్కన చేరకుండా పాడుకోండి పోకేం చేస్తాం '

ఆవిడ వుక్కిరి బిక్కిరైంది. నీళ్ళు చిమ్మే కళ్లు దించుకుంది.

'మా తప్పు మన్నించన్నయ్యగారు. మొగదిక్కులేనిదాన్ని. మిగిలిన నలుసు

వాడొక్కడు. పదేళ్ళకు గాలి మాటలొచ్చినయ్ సరిగ్గా నడవలేదు. ఎందరు డాక్టర్లకి చూపించినా మెదడు సరిగ్గా ఎదగలేదన్నారు వీదిలోకి పంపిస్తే ఏ లారీకింద పడ్తాడో ఏ ఇంట్లో దూరి తగాదా తెస్తాడో అని ఆ గదిలో పడి వుండేట్టు అలవాటు చేశాను నాలుగు మెతుకులు తిని ఆ గదిలోనే పడివుంటాడు. ఏళ్ళొచ్చినయ్ అక్షరం ముక్కరాదు. అడిగితే సమాధానం చెప్పటంరాదు రేడియో పెట్టుకుని పాటలు వింటూ కూచుంటాడు ' దుఃఖాన్ని దిగమింగి పట్టి పట్టి మాటాడుతుందామె 'దేముడు ఏమివ్వకపోయినా ఆ కంఠాన్ని యిచ్చాడు ఆ పిచ్చి పాటలు పాడుతూ వుంటాడు మీకు కష్టం కల్గించాలనికాదు పాడొద్దురా అంటే వినడువాడు అక్కడికీ మీకు యిబ్బంది కల్గించకుండా వుండాలనే పదిరోజులు మా అక్కయ్య యింటికి పంపించాను. వెర్రివాడ్ని ఎవరు మాత్రం ఎంతకాలం వుంచుకుంటారు? మీరు వెళ్ళిపోతారంటే నా కడుపు తరుక్కుపోతూ వుంది ఎవర్నీ యిబ్బంది పెట్టినదాన్ని కాదు ' చెయ్యని నేరానికి బలవుతున్నదాన్లా ఏడవసాగిందామె

ఆ పాటలు పాడేది పిచ్చిపిల్లవాడనేసరికి సత్యవతికి జాలి పొంగుకొచ్చింది

'పిల్లల్తో ఇప్పుడెక్కడికి వెళ్తారన్నయ్యగారూ నాల్రోజులు టైమివ్వండి రెండు గదులు చూసుకుని నేనే పోతాను. ఈ ఒక్కసారికీ మమ్మల్ని మన్నించం'డని అభ్యర్థించిందామె.

'చూడమ్మా. మీరిక వెళ్లొచ్చు పిచ్చో మంచో నాకు అనవసరం ఈ పొరుగున ప్రశాంతంగా బతకటం కష్టం. మా కెవరి మీదా కష్టంలేదు వుండి ఏం చేస్తాం నేను ఒకమాట అన్నానంటే దానికి తిరుగులేదు. కానీ టైమయింది ' సత్యాన్ని కసిరాడు కాసేపు దిగాలుగా చూసి వెళ్ళిపోయిందామె ఇల్లు తాళంవేసి సామాన్లతో బయలుదేరాడు ఆనందరావు వెళ్తూ పక్కవాటా వేపు చూసింది సత్యం, వేసిన తలుపులోంచి నీ యూశా అడియాశా'

మెదడు ఎదగని వెర్రివాడి కంఠం నడకరాని పిచ్చివాడి కంఠం పాట జాలిగా మనసులోని మెత్తని పొరల్నికదిలిస్తూంది

కదల్లేక నిలబడ్డ సత్యాన్నీ 'తొందరగారా, పిచ్చాడిపాట వొదలబుద్ధి కావటం లేదా' అని ఓ కసురు కసిరాడు ఎవరికి పిచ్చని తెల్లబోయింది ఆనందరావుని అనుసరించింది

ఏం చేస్తాం కొందరికి పసిపాపల నవ్వులన్నా పచ్చనిచేలన్నా చల్లని వెన్నెలన్నా పూలవాసనలన్నా గిట్టవు

ఈ ప్రపంచాన్ని పాలించండని ఒక్కరోజు అధికారం యిస్తే వీచేగాలికి కూడా హద్దులు పెడతారు పచ్చని ప్రతిదానికీ ఒక రాత్రిలో చిచ్చుపెడతారు తన దారాలతో తన్ను బిగించుకున్న సాలెపురుగులా తమ సూత్రాలతో మానవత్వానికి వురి పోసుకుని బతుకుతున్న మనుషులు వీళ్ళు.